

# అర్థాంతరన్యాస

## గర్లపాడి రాధాకృష్ణమూర్తి

అప్పుడే స్కూలు వదిలారు. పుస్తకాల సంచి చంకకు తగిలించుకొని పరుగెత్తుతూ వచ్చి వేణుకంటే ముందర ఆస్పత్రి గేటు చేరాను. రోజూ మాకిదే పంతం—స్కూలు వదలగానే ఆస్పత్రి గేటు ముందు ఎవరు చేరుతారో నని. అక్కడికి చేరగానే పరుగు ఆపి ఆస్పత్రి వెనక మొండి గోడ దాకా నిదానంగా నడుస్తాం—ఆయాసం తీర్చుకుంటూ. వెనకవైపు మొండి గోడ దాటగానే వేణు ఎడంవైపు మునసబు కోర్టు దారిని వెడతాడు. మునసబు కోర్టు వెనకే ఉన్న బంగళా వాళ్ల ఇల్లు. నేనేమో ఆస్పత్రి వెనకున్న కాలవ దాటి నేరుగా సినిమా హాలుకేసి నడుస్తాను—ఇంటి దారి.

మొండిగోడ దాటగానే వేణు ఎడంవైపు తిరిగాడు. నేను కాలవలోకి దిగాను.

అది పేరుకు మాత్రమే కాలవ. సంవత్సరంలో చినుకులుపడ్డ ఏ నాలుగు రోజులో తప్ప— మిగతా రోజుల్లో అది ఎండిపోయి వుంటుంది— నెల మొదటి తారీకున చిరునవ్వు నవ్వి మిగతా ఇరవైతొమ్మిది రోజులూ దిగాలుగా ఉండే మా మాష్టారిలాగ. రోజూ పనికిరాని చెత్తా, చెదారం, పాత గుడ్డలు—వాడి తీసి పారేసిన డ్రస్సింగ్సు— పగిలిన మందు సీసాలు, అన్నీ ఆ కాలవలోకి గిరాటు పెడుతూంటారు ఆస్పత్రిలోంచి. సంవత్సరమంతా ఇలా పేరుకున్న పాప పంకిలమంతా ఎవరికన్నా రోత పుట్టి ఒక అగ్గిపుల్ల గీసి పడేస్తే తగలబడి నంతవరకూ తగలబడుతుంది. లేకపోతే అదంతా వర్షాకాలంలో వరుణుడికి దయ కలిగి నాలుగు చినుకు లెక్కువ పడితే అన్నీ కలిసి తేలి కొట్టుకుపోతూ కథల్లో వినే వైతరణిని గుర్తుకు తెస్తూంటాయి.

కాలవలో ఎవరివో రోగులపాత మురికి గుడ్డలు తగలబడుతూన్న వార్తను గాలిలో తేలివచ్చే కమురు కంపు మోసుకొస్తున్నది. కాలవ కట్ట ఎక్కి వీధిలో కొచ్చాను.

వీధిలో రెండిళ్లు దాటగానే మస్తాను మిషను చప్పుడు వినపడుతుంది. అది దాటి మరి నాలు గడుగులేస్తే ఎడమవైపున ఒక 'అంజనేయ ఆటో వర్క్ షాప్' ఉంటుంది. ఆ తర్వాత అన్నీ మామూలు కాపురాల ఇళ్లు.

ఆటో వర్క్‌షాప్‌లో ఏదో వెల్డింగ్ చేస్తున్నాడు ఒకతను. మరొకతను 'నాగూర్‌వలి లారీ సప్లయర్స్' లారీకింద పడుక్కొని ఏదో రిపేర్ కాబోలు చేస్తున్నాడు.

ఆటోవర్క్‌షాప్ దాటగానే వీధి చివర మూల తిరుగుడునున్న అరుగుల పెంకుటిల్లు కన్పిస్తుంది. ఆ ఇంటి అరుగులమీద కూర్చుని రోజూలాగే ఆమె ఎదురు చూస్తున్నది.

రోజా అక్కడ అదేవేళకి అరుగు మూలన గోడ కానుకుని—ఒక కాలు అరుగుమీద మడత వేసి రెండో కాలు గొంతుక్కూర్చున్నట్లుగా పెట్టి ఆ మోకాలుపైన కుడిచెయ్యి పెట్టుకొని అర చెయ్యి చెంప కాన్చుకొని కూర్చొనుంటుంది. పక్కనే ఒక పాత వెదురు కర్ర—తల అంతా పండిపోయి, బొమ్మ దేవుడికి వీచే నింజామరంలాగ ఉండేది. నుదురు, ముఖం, అంతా ముడతలుపడి నలిపేసిన

కాగితం లాగుంటుంది. ఆమె కట్టుకున్న ధోవతి మాసిపోయి చినుగులుపడి ఉంటుంది—మా స్కూలులో క్లాసుకీ క్లాసుకీ మధ్యనుండే తడికల్లాగా. ఆమె కళ్ళు లోతుకు పీక్కుపోయి—ఎక్కడో నూతిలోంచి చూస్తున్నట్లుండేది. నేను ఆటో వర్క్‌షాప్ దాటి, నన్ను చూడగానే దీనంగా ఎండాకాలంలో ఎండిపోయిన నదుల్లాగుండే ఆమె కళ్ళు వర్షం పడగానే చిరునవ్వు నవ్వే ముత్యపు చిప్పల్లాగా—ఒక్కసారి వెలిగేవి.

ఆమె కన్పించగానే నేను అటే చూస్తూ నడుస్తాను, దారి సంగతి మర్చిపోయి. ఆవిడ నా వైపే చూస్తూంటుంది. నేను బాగా దగ్గరికి రాగానే పళ్ళూడటం వల్ల లోపలికి ముడుచుకున్న పెదిమలు మెల్లిగా సాగి చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేస్తాయి. అప్పుడు ఆమె నుదుటిమీది గీతలు అడ్డంగా సాగుతాయ్. కణతల దగ్గర గీతలు ఎక్కువై లోతుగా పొడుగ్గా అవుతయ్. లోతుగా ఉన్న కళ్ళు కొద్దిగా ముందు కొచ్చినట్లుగా ఉండి భయం వేస్తుంది చూడటానికి. అప్పుడు నా కేదో కొంచెం బెరుగ్గా ఉంటుంది. గబగబా అడుగు లేస్తూ ఎదురుగ్గా సినిమా హాలుమీద జ్యోతి పట్టుకున్న అమ్మాయి బొమ్మకేసి చూస్తూ నడుస్తాను—వీధి మలుపు తిరిగేదాకా. సరిగ్గా వీధి మలుపు తిరగబొయ్యేముందు—ఎందుకో ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తాను. ఆమె ఇంకా నా వైపే చూస్తూంటుంది— పడమటి లోయలోకి దిగుతూన్న సూర్యుణ్ణి ఆఖరు సారిగా చూసే పొద్దు తిరుగుడు పువ్వులాగా.

అంతే—ఆమె కను మరుగై పోతుంది.

రోజూ ఇది క్రమం తప్పకుండా జరిగే దినచర్య.

మూల తిరగ్గానే బామ్మ అన్నంలోకి వెయ్యబోయే చామ దుంపల వేపుడూ— పెరుగూ— తల్చుకుంటూ ఇంటికి నడిచాను.

* * *

క్లాసులో మాష్టారు సిపాయిల తిరుగుబాటును గురించి చెబుతూంటే—నేను బయట చింత చెట్టు కింద, ఇసుకలో ఆడుతున్న అమ్మాయిల్ని చూస్తున్నా. బేబీ పిన్ను పళ్ళమధ్య ఇరికించి, గాజులు మోచేతివైపు నెట్టుకుని, ఆట మొదలెట్టింది రేవతితో—పక్క క్లాసుల్లో ఎక్కడ్నుంచో సర్మా సుబ్బయ్య మాష్టారి గొంతు ఖంగుమంటోంది.

నా ఆలోచన్లు అనుకోకుండా—అరుగుల పెంకుటింటి ముందరి ముసలావిడ దగ్గరి కెళ్ళినై.

కళ్ళముందు ముడుతలు పడిన ఆమె ముఖమే కన్పిస్తోంది. రెండు రోజుల్నుంచీ ఆమె అరుగుమీద కన్పించటంలేదు. ఆమె ఎవరో నాకు తెలీదు. ఇన్నాళ్లనుంచీ రోజూ చూస్తున్నానన్న మాటేగాని ఒక్క మాట మాట్లాడలేదు. రోజూ ఆటోవర్క్‌షాప్ దాటగానే ఆవిడ అరుగుమీద కన్పించినప్పట్నుంచీ సినిమా హాలు దగ్గర వీధి మలుపు తిరిగే వరకూ ఆమె నా వైపూ, నేను ఆమెవైపూ చూడటం—అంతే మా పరిచయం. ఆమె నా వైపు ఎందుకలా చూస్తుందో నా కర్థంగాదు. పోనీ— నే నెందుకలా చూస్తానో నాకే తెలీదు. ఆమె అంటే—అదీ ఆమె బోసినోటి నవ్వు చూస్తే నా కేదో బెరుగ్గా ఉంటుంది. అలా అని ఆ దారి మానెయ్యబుద్ధి పుట్టదు. ఆ దారి వదిలేసి నేను ఫొటో స్టూడియో మీదుగా ఇంటికి పోవచ్చు. ఊహూ సరిగ్గా స్కూలు వదిలే వేళకు అస్పత్రివైపు కాళ్ళు పరుగెత్తుతై నాకు తెలీకుండానే.

గత రెండు రోజుల్నుంచీ—స్కూలు వదిలి వీధిలోకి రాగానే నా కోసమే ఎదురు చూస్తున్నట్టుండే ఆమె, అరుగుమీద కన్పించటంలేదు. మొదటిరోజు ఆమె కన్పించకపోతే ఎందుకా అని ఆలోచిస్తూ ఇంటి కెళ్ళానుగాని— ఇంటి కెళ్ళగానే బాబాయి తెచ్చిన క్రికెట్‌బాట్ చూస్తూ అంతా మర్చిపొయ్యాను. ఆ సాయంత్రం అంతా క్రికెట్‌లో మునిగితేలాను. కొత్త బ్యాటు భలే ఉంది. షాట్ కొడితే బాలు గింగిరాలు తిరుగుతూ పోతూంది తుపాకి గుండులాగు.

నిన్న స్కూలు నుంచి వస్తూంటే మళ్ళీ కన్పించలేదు ఆమె. ఏదో వెల్తి అన్పించింది. ఆయిల్లు దగ్గరి కొచ్చిన దాకా అటే చూస్తూ నడిచాను. ఆ యింటి ముందు ఒక్క నిమిషం ఆగాను. లోపలి కెళ్దామనిపించింది. మెట్టుగా ఉపయోగ పడుతున్న పగిలిన బండ మీదికెక్కి నుంచున్నాను. పగిలి బీటలు వారిన తలుపు దగ్గిరగా వేసుంది. అంతా నిశ్శబ్దంగా వుంది. లోపలికెళ్ళటానికి తలుపు మీద చెయ్యి వేశాను. నాకెందుకో భయం వేసింది—గిరుక్కున వెనక్కుతిరిగి ఇంటికి పరుగెత్తాను.

"అలా పరుగులు పెట్టక పోతే కొంచెం నిదానంగా రాకూడదట్రా నాయనా!"అన్నది బామ్మ వగరుస్తూ ఇంట్లోకెళ్ళిన నన్నుచూసి.

నిన్న అంతా ఆమే నాకళ్ళముందు కన్పిస్తోంది. పండిన జుత్తు— నలిపేసిన కాగితం లాగా ముడుతలు పడ్డ ముఖం—చీలికలూ పేలికలూ అయినధోవతి— నిన్నామొన్నా ఎందుక్కన్పించలేదో !

* * *

తొడ చుఱ్ఱుమనగానే ఉలిక్కిపడి పక్కకుతిరిగాను. వాసుగాడు తొడగిల్లాడు—వెధవాయ్! నాకు ఒళ్ళు మండి వాడి పని పట్టబోతుంటే— మాష్టారివైపు చూపించాడు డెస్కుకిందినుంచి. మాష్టారు నావైపే చూస్తున్నారు. క్లాసంతా గొల్లుమంది.

నేను లేచి నుంచున్నా.

"మాట్లాడవేం?" మాష్టారిగొంతు ఖంగుమంది.

నాకేంతెలుసు, ఏం మాట్లాడాలో? 'ఏమిటండి మాష్టారూ'అన్నా. క్లాసంతా మరోసారి గొల్లుమంది.

"సైలెన్స్! సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?"

నాకెలా తెలుస్తుంది? గుడ్లప్పగించి చూస్తున్నా.

"ఏం?"

"... .. ...... .. ."

"ఏంటేగా తెలిసేందుకు, వెధవా! వెళ్ళు, బెంచెక్కు."

నేను వెధవముఖం వేసుకుని వెనక్కెళ్ళి బెంచెక్కాను.

మాష్టారు పాఠం అందుకున్నారు—

చింత చెట్టుకింద బేబివాళ్ళు లేరు—

ఆమె ఇవాళ్ళైనా కనబడుతుందో లేదో—

* * *

స్కూలు వదలగానే నేను బెంచిదిగి వెళ్ళి బాగ్ వంకకు తగిలించుకొని వేణుని కలిశాను. వాడు మామూలు అలవాటు ప్రకారం పరుగెత్తబోయి నేను ఏదోరకంగా ఉండటం చూసి గాబోలు నిదానంగా నడిచాడు. ఇద్దరం ఏమీ మాట్లాడలేదు. అస్పత్రిలో వేపచెట్టుకింద—మంచం తిరగేసి ఎండ తగలకుండా గూడుకట్టి ఎవర్నో పడుకోబెట్టారు. మంచం పక్క ఒక ఆడామె ఇద్దరు మొగవాళ్ళు కూర్చునున్నారు దిగులుగా—నిశ్శబ్దంగా నడిచాం ఇద్దరం. మొండి గోడదగ్గర వంటగదిముందర సైకిల్‌కట్టు రామ్మూర్తి డేగిసాలో పులుసు పోస్తున్నాడు. మొండి గోడ దాటగానే వేణు ఎడం పక్కకు తిరిగేడు. నేను కాలవలోకి దిగాను. కుడి పక్కన ఎవరిదో కాలిప్లాస్టర్ తీసేశారు గాబోలు — పడున్నది. మూలన పోస్టుమార్టం గదిదగ్గర ఎవరో తిరుగుతున్నారు.

కాలవ కట్ట ఎక్కి వీధిలోకొచ్చాను. మస్తాను మిషన్ శబ్దం వినిపించడంలేదు. మిషన్ దగ్గరగా నేలమీద పరిచిన ఈతచాప మీద కూర్చుని అబ్దుల్లా చొక్కాకాజాలు కుడుతున్నాడు. వీధిలో నేను తప్ప మరెవరూ లేరు. ఆంజనేయ ఆటోవర్క్‌షాప్‌లో బోనెట్ పైకెత్తిన లారీ ఒకటి నోరు తెరిచిన భూతంలా ఉంది. అంతా నిశ్శబ్దం.

షాపు దాటగానే నాదృష్టి అరుగుల పెంకుటింటి మీదికి పోయింది. అరుగులు ఖాళీగా ఉన్నై. ఇవాళ కూడా ఆమె లేదు. నాకేదో వెల్తి అనిపించింది. అటేచూస్తూ నడిచాను. అడుగడుక్కీ ఆమె కన్పిస్తుందేమోనన్న ఆశతో. ఉన్నట్లుండి ఒక్కసారిగా అరుగుమీద ప్రత్యక్షం కాగూడదూ ఆమె! ఊహూ. ఆమె కన్పించలేదు.

ఇంటి దగ్గరి కొచ్చాను. అంతా నిశ్శబ్దం. వీధిలో ఆమూల సినిమాహాలు దగ్గర్నించి యీచివర అస్పత్రి దాకా ఎవరూలేరు. దూరాన సినిమాహాలు గోడ మీద జ్యోతి పట్టుకున్న అమ్మాయి బొమ్మ ఎండలో నల్లగా నిగనిగలాడుతూంది. మెట్టులాంటి పగిలిన బండమీద అడుగు పెట్టాను. పగిలి నెర్రెలు వాసిన వీధితలుపు ఓరగా తీసిఉంది. గొళ్ళెం ఒకటి పగులులోంచి వదులుగా వేలాడుతోంది. ఏదో భయమేసింది. మళ్ళీ వీధి యీచివరనుంచి ఆచివర దాకాచూశాను. ఎవరూలేరు. ధైర్యంచేసి, పుస్తకాలనంచి గట్టిగా పట్టుకొని లోపలికడుగెట్టాను. కుడివైపున గిలక బావి. గిలక సగం పగిలిపోయి ఉంది. బావి అంచు ఒకమూల విరిగిపోయింది. ముళ్ళువేసిన కొబ్బరినార తాడు చివర సొట్టలుపడ్డ బొక్కెన. పెంకువసారాలోనుంచి గుమ్మం దగ్గరికి నడిచాను. లోపల్నించి సన్నని జీరగొంతుతో ఏమో మాటలు విన్పించాయి—

"ఏదో—కాలూ చెయ్యా ఆడక—నా తావత్రయమే కాని—ఏదో నా పిచ్చి—లేకపోతే నువ్వు ఇక్కడి కొస్తే ఏంగాను—నీ పరువు పొద్దై పోదూ—వద్దు—వద్దు—యీ కట్టె ఎలాగో వెళ్ళిపోతుంది. దీనికోసం దిగులుపడకు—నువ్వు నాలుక్కాలాలు చల్లగా—ఉండటమే—అదే పదివేలు. ఏదో కన్నతీపిగాని— ....."

నేను మెల్లిగా తలుపు నెట్టాను. కిర్రుమని ఏడుస్తూ తెరుచుకుంది తలుపు—లోపల కుక్కిమంచం ఒకటి జోలెలా వేలాడుతోంది. అందులో ఉండీ లేనట్టున్న దుప్పటిమీద ఆమె .!! తలక్రింద ఏదో పాత గుడ్డలమూట దిండుగా ఉపయోగ పడుతున్నది.

"నీవు కడుపున పడగానే ఆ మహారాజు దాటి పొయ్యారు. నీమీది ఆశతో— కళ్లతో ప్రాణాలుంచుకుని—నీకోసం—"

ఆయాసంవచ్చి ఆగింది—

మంచంకింద చిలుంపట్టిన కంచు చెంబూ—సొట్టలుపోయిన సత్తు కంచం—మూలన బూడిద నిండిన పొయ్యీ—పాత గిన్నెలు రెండు—అంచు పూర్తిగా విరిగిన ఇత్తడి బిందె

నేను దిక్కుతోచక అలాగే చూస్తూ నుంచున్నా

ఏదో తల్లి దయవల్ల నీకు—అక్షరం ముక్క అబ్బింది—అంతే ఆశతోనే—ఏనాటికైనా నా కష్టాలు — గట్టెక్కుతాయనే ఆశతో—బతికా నాయనా—నా ఖర్మ—లేకపోతే— కన్న కొడుకు ఇంత వాడివైతే—కనుచూపే కరువైంది నాకు—ఏజన్మలో ఏ పాపం చేశానో—ఏ తల్లీ కొడుకుల్ని విడదీశానో.

ఎండిపోయిన చెరువుల్లాంటి ఆమె కళ్లలోంచి కొసలగుండా కణతలమీదికి నీరు కారుతున్నది.

నల్ల కుక్కపిల్ల ఒకటి మంచం చుట్టూ తిరుగుతున్నది దిగులుగా—

నాకు దిగులేసింది—

"ఏమండీ !" అన్నా జీరపోయిన గొంతుతో—

"నీకు మాత్రం—యీ తల్లిని—చూడాల నుండకనా ! ఏదో నా వైరిగాని—నీ వుద్యోగం—సంసారం—ఎన్ని పనులో—ఎన్ని చికాకులో—నీకు తీరిక గాని—"

దగ్గు తెర వచ్చింది.

"ఏమండీ !!" కొంచెం గట్టిగా అన్నా గొంతు పెగుల్చుకుని—

నెమ్మదిగా కళ్లు తెరిచింది ఒక్క క్షణం ఆగాక నన్ను పోల్చుకుంది గాబోలు లోపలికి ముడుచుకున్న పెదిమలు మెల్లిగా చిరునవ్వు నవ్వడానికి సాగేయి

కప్పులో పెంకులు రాలిపోయి— అక్కడక్కడా సూర్యరశ్మి గుండ్రంగా కత్తిరించిన సీనారేకు బిళ్లల్లా— నేలమీద పడి మెరుస్తోంది. ఒకమూల గోడనుంచి సున్నపు బెత్తిక రాలి పడింది—పాత కాగితంమీది సిరాచుక్కలాగ—

ఆమెను చూస్తూంటే స్కూలు లాబొరేటరీలో ఉన్న అస్థిపంజరానికి ఈ ధోవతి కట్టబెడితే ఇలాగే ఉంటుందనిపించింది.

ఇల్లు అంతా వాసన—

తెరిచిన కళ్లు మూసుకుపొయ్యాయి—

"అంతా నీలాగే—ఉండేవాడు—అవే కళ్లు—"

మళ్ళీ దగ్గుతెర—మెలికలు తిరిగిపోతున్నది—

చెయ్యి నోటిదగ్గర పెట్టుకొని మంచినీళ్లన్నట్లుగా సైగ చేసింది.

పుస్తకాల బాగ్ కిందుంచి నేను చిలుం పట్టిన కంచు చెంబు తీసుకొని— బావి దగ్గరికి పరిగెత్తా ఆ బొక్కెన అంతా చిల్లులుపడి— పైకి వచ్చేసరికి సరిగా చెంబునిండా గూడా రాలేదు నీళ్లు— చెంబు తీసుకువచ్చేసరికి, దగ్గుతెర తగ్గిందేమో మళ్ళీ తనలో తనే మాట్లాడుకుంటున్నది.

"నీకోసం గదూ— నే బతికింది— ఎవరెన్నిఅంటేనేం— నీకు తెలీదూ— నేనేదో చేశానని అంటారుగాని— నా కన్నతండ్రిని—నీకోసం—నేనేం చేస్తే తప్పవుతుంది—"

మళ్లీ దగ్గుతెర— వూపిరాడకుండా ఈసారి. దగ్గుతూంటే బొళుక్కున నెత్తురుపడి గుడ్డంతా [illegible] అయింది.

నాకు భయమేసింది— కంచుచెంబు అక్కడ పెట్టి—పుస్తకాల బాగ్ తీసుకు పరుగెత్తా.

ఇంటికివచ్చి బామ్మకు ఒక్క గుక్కలో అంతా ఏకరువు పెట్టాను.

"అబ్బబ్బ—అడ్డమైన కొంపలకూ తిరగడం ఎక్కడ అబ్బిందిరా నాయనా నీకూ! అమ్మా, నాన్నా దూరా నెక్కడో ఉన్నారుగదా అని ఇక్క డుంచితే —ఆ పాడుకొంప కెళ్లడానికేం ఖర్మ పట్టిందిరా నీకు ! ఎవరి ఖర్మాన వాళ్లు పోతారు. నువు రాకూటికి— చేసినపాపం వూరికే పోతుందా ! అనుభవించొద్దూ—నువ్వు పద—ఈసారి అటు మొహం చూపావంటే బాబాయికి చెప్పి తాట ఒలిపిస్తా— పద." అంటూ అన్నం దగ్గరికి లాక్కెళ్లింది.

* * *

అన్నం తిని స్కూలు కెళ్లినా—స్కూలు వదిలిందాకా నా మనసెలాగో ఉంది. స్కూలు వదలగానే వస్తూ బామ్మ చెప్పిందంతా గాలికి వదిలేసి— ఆ యింటిదగ్గరి కొచ్చేసరికి— కాళ్లు యాంత్రికంగా లోపలి కెళ్ళాయి.

మధ్యాహ్నం నే నెలా వదిలానో అంతా అలాగే ఉంది. కంచుచెంబు దొర్లి— సగం నీళ్లు గచ్చు మీద ఆరిపోయినై. మంచం మీద ఆమె అలాగే కళ్లు సగం మూసి పడున్నది. ధోవతిమీది రక్తం ఇంకిపోయి ఈగలు వాలుతున్నై. సగం తెరుచుకున్న నల్లటి పెదిమలమీద ఈగ ఒకటి— నల్లటి బక్కచిక్కిన కుక్కపిల్ల ఎండిపోయిన ఆమె రొమ్ము మీద తల ఆన్చి కుయ్యోమని ఏడుస్తున్నది

నే నక్కడ నుంచోలేక పరిగెత్తా—

* * *

సాయంత్రం బామ్మ యిచ్చిన కాఫీ తాగి— వీధి గుమ్మం మెట్లమీద అరచేతుల్లో గడ్డం ఆన్చి కూర్చున్నా. మనసేమీ బాగోలేదు — ఆడుకోవాలని బుద్ధి వెయ్యలేదు.

ఎదురింటి రుక్మిణమ్మగారు "ఏరా కృష్ణా ! ఆడుకుందుకు వెళ్లలేదూ ?" అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

ఆవిడ శంకరస్తుతిలో మునిగిపోయింది.

చీకటి పడుతూంది వీధి దీపాలు వెలిగించారు.

నా ఎదురుగా నీడ పడేసరికి తలెత్తాను. వేణు— బిక్కమొగం వేశాడు. "ఏమిట్రా యిది ?" అన్నా వాడి చెంప చూసి.

"మా నాన్న కొట్టాడు" అన్నాడు వాడు తల దించుకుని.

"ఎందుకు ?" నాకు వాళ్ల నాన్నమీద భలేకోపమొచ్చింది. ఈ పెద్దవాళ్ల కసలు బుద్ధిలేదు !

"పొద్దున నేను స్కూలునుంచి వెళ్తూంటే— ఎవరో "మునసబుగారి తల్లికి బలువుగా ఉందిటగా" —అనుకుంటున్నారు. నే నింటికి వెళ్ళి మా నాన్న నడిగాను. మా నాన్న 'ఏడ్చావ్ వెధవా, నోర్ముయ్! అన్నీ నీకే గావాలి' అంటూ చెంపమీద కొట్టాడు."

వీధి దీపం వెల్తుర్లో తెల్లటి వాడి చెంపమీద నాలుగు వేళ్లు—నల్లగాకంది కాయల్లా మెరిసినై. ★

